తెలంగాణ
# వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871

తెలంగాణ వెన్నెల వాక్కు
విలేకరులు కావలెను
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :52 | 06-09- 2026 | ఆదివారం | పేజీలు: 4 | వెల:03/-

# రెండేళ్లు చాలు..

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా

### పీఆర్సీ, ఇంక్రిమెంట్లకు హామీ.. ధర్నాలు వద్దంటూ విజ్ఞప్తి




కొడంగల్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రెండు సంవత్సరాలపాటు సహకరించి వెసులుబాటు కల్పిస్తే పీఆర్సీ, ఇంక్రిమెంట్ల వంటి ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. నిరుపేదల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి విద్యా రంగంలో సంస్కరణలు చేపట్టిన ఈ దశలో తెలంగాణ విద్యా వ్యవస్థను భారతదేశానికి ఒక దిక్సూచిలా నిలబెట్టడానికి ఉపాధ్యాయులంతా

2

# ఉపాధ్యాయుల అంకితభావం స్ఫూర్తిదాయకం

### జాతీయ ఉపాధ్యాయుల పురస్కార గ్రహీతలతో ప్రధాని మోదీ భేటీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: జాతీయ ఉపాధ్యాయుల పురస్కారాలు అందుకోనున్న విజేతలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 7, లోక్ కల్యాణ్ మార్గ్‌లో సమావేశమై ముచ్చటించారు.
ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల పట్ల వారి నిబద్ధత ఎంతో స్ఫూర్తిదాయకమని ప్రధాని ప్రశంసించారు. బోధనను కేవలం ఉద్యోగంగా కాకుండా బాధ్యతగా భావిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు.



ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు తమ బోధనా అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. విద్యార్థుల్లో

2

# భూ భారతి.. రైతుల భూములకు భారమా?

### 22-ఏ నిషేధిత జాబితా నుంచి పట్టా భూములు తొలగించాలి.. ఇందిరాపార్క్‌లో బీజేపీ మహాధర్నా

హైదరాబాద్, సెప్టెంబర్ 5: తెలంగాణ వెన్నెల వాక్కు
భూ భారతి చట్టం, 22-ఏ నిషేధిత జాబితాలో పట్టా భూముల చేరికపై తెలంగాణ బీజేపీ పోరుబాట పట్టింది. రైతుల భూములపై ఆంక్షలు విధించి వాటిని విక్రయించుకునే అవకాశం లేకుండా చేస్తున్నారని ఆరోపిస్తూ శనివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, 22-ఏ బాధితులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ.. రైతులకు స్వేచ్ఛగా అనుభవ హక్కులు ఉన్న పట్టా భూములను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో భూమిని విక్రయించుకోవాలనుకున్నా రిజిస్ట్రేషన్




జరగకపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పిల్లల వివాహాలు, కుటుంబ అవసరాలు, అప్పుల చెల్లింపులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో తమకున్న భూమిని అమ్ముకునే

2

# కాంగ్రెస్ '420' పాలనకు చరమగీతం పాడాలి



కరీంనగర్ యువ సమరభేరిలో కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు
కరీంనగర్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలనంతా '420' మోసాల మయంగా మారిందని ఆరోపించారు. తెలంగాణ సాధించిన మహానాయకుడు కేసీఆర్ రాజీనామాను కోరే నైతిక

2

# బీజేపీ పార్టీ డస్ట్ బిన్ కాదు

### మధ్యలో మా పార్టీని ఎందుకు లాగుతున్నారు
### కొండా సురేఖ చేరిక ప్రచారంపై సీనియర్ నేత ఫైర్



హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో గత కొద్ది రోజులుగా తీవ్ర దుమారం రేపుతున్న అంతర్గత విభేదాలు, రాజకీయ పరిణామాలు అనుహ్య మలుపులు తిరుగుతున్నాయి. ముఖ్యంగా కొండా సురేఖ దంపతులు కాంగ్రెస్ అధిష్ఠానంపై చేసిన వ్యాఖ్యలు, ఆ తదనంతరం ఆమెను మంత్రివర్గం నుండి హఠాత్తుగా తొలగించడం రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించింది. ఈ క్రమంలోనే మంత్రి పదవిని కోల్పోయిన కొండా సురేఖ త్వరలోనే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, భారతీయ

3

# వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు

### పేదలు, రైతులు, మహిళలు, నిరుద్యోగులే లక్ష్యంగా ప్రజా పాలన: సీఎం రేవంత్‌రెడ్డి




నకిరేకల్, సెప్టెంబర్ 6: తెలంగాణ వెన్నెల వాక్కు
రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి వివక్ష లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా పాలన ప్రధానంగా పేదలు, రైతులు, మహిళలు, నిరుద్యోగుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందని అన్నారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వెయ్యి రోజుల ప్రజా పాలన

3

# విద్యార్థుల స్క్రీన్ టైమ్‌పై ప్రధాని ఆందోళన

### టీచర్స్ డే వేళ ఉపాధ్యాయులకు మోదీ పిలుపు



న్యూఢిల్లీ బ్యూరో
ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు సాధించిన ఉపాధ్యాయులతో న్యూఢిల్లీలోని లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని తన నివాసంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దేశవ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి ఎంపికైన 82 మంది విశిష్ట ఉపాధ్యాయులతో ప్రధాని ముఖాముఖీ నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ

3

TGTEL/25/A0871
తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU



# రేవంత్ మార్క్ పాలన!

# హైడ్రా ప్రశంసలు, వర్గపోరు గండాలు

### విజయాల వెనుక విభేదాలు..తెలంగాణ కాంగ్రెస్ ముందున్న అసలైన పరీక్ష




తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజుల మైలురాయిని విజయవంతంగా చేరుకున్న సందర్భంలో సంబరాలు జరుపుకుంటున్న ఈ వేళ, ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలు ఒకవైపు ప్రస్ఫుటంగా కనిపిస్తుంటే, పార్టీని పట్టిపీడిస్తున్న అంతర్గత విభేదాలు మరొకవైపు తీవ్రమైన సవాలుగా పరిణమించాయి. ఒక దశాబ్ద కాలం పాటు సుదీర్ఘంగా ప్రతిపక్ష పాత్రకే పరిమితమై, అనేక రాజకీయ ఒడిదుడుకులను ఎదుర్కొన్న కాంగ్రెస్ పార్టీ, 2023 చివరి నాటి అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య విజయాన్ని నమోదు చేసి అధికారాన్ని చేజిక్కించుకుంది. ఆ సమయంలో పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలన నుండి మార్పును కోరుకున్న తెలంగాణ ప్రజానీకం, కాంగ్రెస్ ప్రభుత్వంపై అపారమైన ఆశలను, అపరిమితమైన ఆకాంక్షలను ఉంచారు. ప్రజల అంచనాలకు అనుగుణంగానే అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యంత్రాంగం అత్యంత వేగంగా, వ్యూహాత్మకంగా అడుగులు వేయడం ప్రారంభించింది.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన అతి తక్కువ సమయంలోనే రైతులకు పెద్దపీట వేస్తూ రూ. 2 లక్షల వరకు ఉన్న వ్యవసాయ రుణాలను ఒకే విడతలో రుణమాఫీ చేయడం, మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడం వంటి నిర్ణయాలు విశేష ప్రజాదరణ పొందాయి. వీటితో పాటు పేదరిక నిర్మూలన దిశగా ఇళ్ల నిర్మాణాలు, అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డుల పంపిణీ , నాణ్యమైన సన్న బియ్యం ఉచితంగా అందించే సంక్షేమ పథకాలు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించాయి. మౌలిక వసతుల కల్పనలో భాగంగా రాజధాని నగరం హైదరాబాద్ రూపురేఖలను మార్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ప్రవేశపెట్టిన 'హైడ్రా' వ్యవస్థ రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఆక్రమణలకు గురైన చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలను నిర్దాక్షిణ్యంగా స్వాధీనం చేసుకునేందుకు 'హైడ్రా' చేపట్టిన కూల్చివేతల పరంపర ఒకవైపు సామాన్య ప్రజలు, పర్యావరణ వేత్తల నుండి విశేష ప్రశంసలు అందుకుంది. అయితే అదే సమయంలో, బాధితుల నుండి ప్రతిపక్షాల నుండి తీవ్రస్థాయిలో విమర్శలను, రాజకీయ వ్యతిరేకతను సైతం మూటగట్టుకోవాల్సి వచ్చింది.

మరొకవైపు, మౌలిక సదుపాయాల విస్తరణ మాత్రమే కాకుండా, భవిష్యత్తు సాంకేతిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగానికి పెద్దపీట వేయడం, పారిశ్రామిక శిక్షణా సంస్థల స్థాయిని పెంచి యువతలో సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచడం, పాఠశాలల మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం మరియు అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రభుత్వం ఆచరణాత్మకమైన ఫలితాలను సాధిస్తోంది. అయినప్పటికీ, పాలనాపరమైన ఈ విజయాలన్నీ పార్టీలోని క్రమశిక్షణా రాహిత్యం మరియు అంతర్గత వివాదాల నీడలో కొట్టుకుపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఇటీవలి పరిణామాల్లో, బహిరంగ వ్యాఖ్యలతో వివాదాస్పదంగా మారిన ఫైర్‌బ్రాండ్ నాయకురాలు, మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుండి హఠాత్తుగా తొలగించడం, అలాగే సుదీర్ఘకాలంగా పార్టీకి సేవలు అందిస్తున్న సీనియర్ నాయకుడు, రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డిపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున కలకలం రేపింది. సురేఖ కుటుంబ సభ్యుల తీరు, నాయకత్వంపై చేసిన వ్యాఖ్యలు పార్టీ ప్రతిష్టను దిగజార్చడమే కాకుండా, ముఖ్యమంత్రి విశ్వసనీయతకే సవాలుగా మారడంతో కాంగ్రెస్ అధిష్టానం ఈ తీవ్ర నిర్ణయం తీసుకోక తప్పలేదు.

ఈ సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం సామాజిక సమీకరణాలను తెలివిగా ఉపయోగించుకుంది. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకుడి స్థానంలో వెనుకబడిన తరగతులకు చెందిన మహిళా నాయకురాలికి మంత్రివర్గంలో చోటు కల్పించడం, అంతేకాకుండా అదే సామాజిక వర్గానికి చెందిన మరో ఇద్దరు మహిళా నాయకులకు ప్రాధాన్యతనిచ్చే పదవులు కట్టబెట్టడం ద్వారా ప్రతిపక్షాల నుండి వచ్చే కుల వివక్ష ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టగలిగింది. అయినప్పటికీ, ఈ మొత్తం పరిణామం పార్టీలో లోతుగా వేళ్లూనుకున్న విభేదాలను, అంతర్గత అసంతృప్తి జ్వాలలను స్పష్టంగా బయటపెట్టింది.

రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంలో సమన్వయ లోపం, వర్గపోరు ప్రధాన ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బిజెపి లకు బలమైన రాజకీయ ఆయుధాలుగా మారాయి. ఐదేళ్ల పాలనా కాలంలో అప్పుడే 1,000 రోజుల విలువైన సమయం ముగిసిపోవడంతో, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇకపై పొరపాట్లు చేయడానికి కానీ, అంతర్గత పోరులో సమయాన్ని వృథా చేయడానికి కానీ అవకాశం లేదు. కొండా సురేఖ ఉదంతం ద్వారా అధిష్ఠానం సీఎం రేవంత్ రెడ్డికి పూర్తి మద్దతుగా ఉందనే సందేశాన్ని ఇస్తూ, అసమ్మతిని అణచివేసేందుకు ఆయనకు పూర్తి అధికారాలు కల్పించింది. రాబోయే మంత్రివర్గ విస్తరణలో లేదా పునర్వ్యవస్థీకరణలో ఈ కఠిన వైఖరి స్పష్టంగా కనిపించే అవకాశం ఉంది.

అయితే రాజకీయంగా ప్రత్యర్థులను, అసమ్మతివాదులను అణచివేయడం మాత్రమే పాలనలో సగం విజయం అవుతుంది. మిగిలిన సగం విజయం ప్రజలకు అందించే పారదర్శకమైన, సమర్థవంతమైన పాలనపైనే ఆధారపడి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రాజకీయ సమీకరణాలు, సంక్షేమ పథకాల ప్రకటనలకే పరిమితం కాకుండా, సేవా భావంతో కూడిన పాలనను ప్రాధాన్యతగా ఎంచుకోవాలి. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఆన్‌లైన్ (సోషల్ మీడియా) ఆఫ్‌లైన్ (ప్రజా క్షేత్రం) ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. ప్రజల్లో పార్టీపై, ప్రభుత్వంపై ఉన్న అభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవడంలో కాంగ్రెస్ విఫలమైతే, రాబోయే ఎన్నికల నాటికి రాజకీయంగా తీవ్ర ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# ఇంట్లో పెద్దల మాట ఎందుకు అంత విలువైనది?

ఒకప్పుడు ఇంట్లో పెద్దలు ఏదైనా చెబితే చిన్నవాళ్లు శ్రద్ధగా వినేవారు. కారణం అడగకుండా పాటించే సందర్భాలు కూడా ఉండేవి. కాలం మారింది. ఇప్పుడు పిల్లలు చదువుకుంటున్నారు, కొత్త విషయాలు తెలుసుకుంటున్నారు, ప్రపంచాన్ని వేగంగా అర్థం చేసుకుంటున్నారు. పెద్దలు చెప్పే ప్రతి మాటను ప్రశ్నించే పరిస్థితి కూడా వచ్చింది. ఇది తప్పు కాదు. కానీ ఆ ప్రశ్నల మధ్య ఒక విషయం మాత్రం మనం మర్చిపోకూడదు.. పెద్దల మాట వెనుక చాలా సంవత్సరాల అనుభవం దాగి ఉంటుంది.మన పెద్దలు చదువుకున్న పుస్తకాలు మనకు కనిపించకపోవచ్చు. వారు ఎదుర్కొన్న కష్టాలు మనకు తెలియక పోవచ్చు. జీవితంలో వారు చేసిన తప్పులు, నేర్చుకున్న పాఠాలు, చూసిన మనుషులు.. ఇవన్నీ కలిపి వారికి ఒక అనుభవాన్ని ఇచ్చాయి. అందుకే వారు చెప్పే ప్రతి మాట శాస్త్రం కాకపోయినా.. దాని వెనుక ఒక జీవన అనుభవం ఉండే అవకాశం ఉంటుంది.మన సంప్రదాయంలో పెద్దలకు గౌరవం ఇవ్వడం కేవలం వయసును గౌరవించడం కాదు. వారి అనుభవాన్ని గౌరవించడం కూడా. ఉదయం లేచి పెద్దలకు నమస్కారం చేయడం, వారి ఆశీర్వాదం తీసుకోవడం వంటి ఆచారాలు మన సంస్కృతిలో అందుకే కొనసాగాయి. ఆశీర్వాదం అంటే కేవలం నోటితో చెప్పే మంచి మాట కాదు.. మనపై ఒక పెద్ద మనసు నిండుగా కోరుకునే శుభం.ఈ రోజుల్లో కుటుంబాలు చిన్నవుతున్నాయి. ఉమ్మడి కుటుంబాల్లో కనిపించే తాతయ్య, అమ్మమ్మలతో పిల్లలు ఎక్కువ సమయం గడిపే అవకాశం తగ్గింది. ఫలితంగా కథలు చెప్పే పెద్దలు తగ్గిపోయారు. ఒకప్పుడు రాత్రి భోజనం తర్వాత పిల్లలు తాతయ్య చుట్టూ కూర్చుని కథలు వినేవారు. ఆ కథల్లోనే నీతి ఉండేది, ధైర్యం ఉండేది, భక్తి ఉండేది, జీవితాన్ని ఎలా ఎదుర్కోవాలో చెప్పే పాఠాలు ఉండే వి.అయితే ప్రతి పెద్ద చెప్పే ప్రతి మాటను ప్రశ్నించకుండా అంగీకరించాలనే అర్థం కాదు. కాలానికి అనుగుణంగా ఆలోచన మారాలి. తప్పుగా ఉన్నది తప్పుగానే చూడాలి. కానీ ఒక మాట పాతదిగా అనిపించిందని దాని వెనుక ఉన్న అనుభవాన్ని పూర్తిగా తిరస్కరించడం కూడా సరైనది కాదు. కొత్త తరానికి కొత్త ఆలోచనలు అవసరం.. పాత తరానికి ఉన్న అనుభవం కూడా అవసరం. ఈ రెండూ కలిసినప్పుడే కుటుంబం బలంగా ఉంటుంది.తల్లిదండ్రులు పిల్లలకు చెప్పే కొన్ని మాటలు చిన్నతనంలో ఇబ్బందిగా అనిపిస్తాయి. బయటికి వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండమంటారు. ఎవరినైనా పూర్తిగా నమ్మ వద్దంటారు. డబ్బును పొదుపు చేయమం టారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోమం టారు. అప్పట్లో అవి సాధారణమైన హెచ్చరికలుగా అనిపించవచ్చు. కానీ జీవితంలో ఒక దశకు వచ్చిన తర్వాత వాటి వెనుక ఉన్న ప్రేమ అర్థమవుతుంది.అందుకే ఇంట్లో పెద్దలు ఉన్నప్పుడు వారి విలువను గుర్తించాలి. వారు చెప్పే ప్రతి మాటను అంగీకరించాల్సిన అవసరం లేకపోయి నా.. వారి మాటను వినడానికి మాత్రం కొంత సమయం కేటాయించాలి. ఒక వృద్ధుడికి కావాల్సింది ఎప్పుడూ డబ్బు కాదు. చాలాసార్లు తన మాట వినే ఒక మనిషి చాలు. తనను పట్టించుకునే కుటుంబం చాలు. తన అనుభవానికి విలువ ఉందనే భావన చాలు.మనిషి ఎంత ఆధునికంగా మారినా.. అనుబంధాల అవసరం మాత్రం మారదు. సాంకేతికత మనకు ప్రపంచాన్ని దగ్గర చేసింది. కానీ మన ఇంట్లో ఉన్న మనిషిని మనసుకు దగ్గర చేయడం మాత్రం మన చేతుల్లోనే ఉంది.పెద్దలు మనతో ఉన్నప్పుడు వారి మాటలు కొన్నిసార్లు పాతవిగా అనిపించవచ్చు.. కానీ వారు దూరమైన తర్వాత అదే మాటలు జ్ఞాపకాలుగా మారతాయి. ఆ జ్ఞాపకాలను తిరిగి వినాలని ఎంత కోరుకున్నా అవకాశం ఉండకపోవచ్చు. అందుకే పెద్దల మాటలో నచ్చినదాన్ని స్వీకరించండి.. నచ్చనిదాన్ని ప్రేమగా పక్కన పెట్టండి.. కానీ పెద్దలను మాత్రం ఎప్పుడూ పక్కన పెట్టకండి.



సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

## రెండేండ్లు చాలు.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా: సీఎం రేవంత్

సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కొడంగల్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొని, భారతదేశ మాజీ రాష్ట్రపతి, ఆదర్శ ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

"మీ చేతిలోనే కలం.. మీ చేతిలోనే బలం"

ఉపాధ్యాయులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "ఆర్థిక వెసులుబాటును బట్టి ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం. మిగతా శాఖలతో పోల్చితే విద్యా శాఖ ఆదర్శంగా నిలబడాలి. పిల్లల భవిష్యత్తుకు మార్గదర్శకులు మీరే. రెండేండ్లు సమయం ఇవ్వండి. రాష్ట్రంలోని ప్రతి ఉపాధ్యాయుడికి విజ్ఞప్తి చేస్తున్నా. రెండేండ్లలో సమస్యలన్నింటినీ సామరస్యంగా మీరు అడక్కుండానే పరిష్కరించే బాధ్యత నాది" అని స్పష్టం చేశారు.

"ప్రభుత్వ సర్వీసులో మీరు 30 ఏళ్లకు పైగా సేవలందిస్తారు. రాజకీయ నాయకులం ప్రతి ఐదేళ్లకు ఒకసారి మీముందుకొచ్చి పరీక్షలు రాయాల్సిందే. నేను చెప్పిన ప్రకారం చేయకుండా ఉంటే.. నిర్ణయం తీసుకోవలసింది మీరే. అందుకు మార్కులు వేయాల్సిందీ మీరే. మీ చేతిలోనే కలం ఉంది. మీ చేతిలోనే బలం ఉంది" అని వ్యాఖ్యానించారు.

ఉపాధ్యాయులకు సీఎం విజ్ఞప్తి

"ఉపాధ్యాయులే వీధుల్లోకి వస్తే ప్రభుత్వానికి, రాష్ట్రానికి శుభ సూచకం కాదు. పిల్లల భవిష్యత్తుకు నిర్దేశకులు మీరు. మీరే ధర్నాలు చేస్తానంటే తప్పుడు సంకేతాలు వెళ్తాయి. ముఖ్యమంత్రిగా విజ్ఞప్తి చేస్తున్నా. రెండేళ్లు సమయం ఇవ్వండి. ఉపాధ్యాయులు, లెక్చరర్లకు అణాపైసా కష్టం రానివ్వను. పీఆర్సీ, ఇంక్రిమెంట్‌లతో పాటు మిగతా సమస్యలు వేటిలోనూ చిన్న కష్టం రానివ్వను. సలహాదారు కేశవరావు గారితో కూర్చొని మాట్లాడండి. నన్ను విశ్వసించి సహకరించండి" అని విజ్ఞప్తి చేశారు.

విద్యా వ్యవస్థలో సంస్కరణలు

"గత ప్రభుత్వంలో పదేండ్ల పాటు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారు. విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపించే శక్తి ఉపాధ్యాయులపైనే ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో 80 వేల అడ్మిషన్లు పెరిగాయంటే ఆ గొప్పతనం ఉపాధ్యాయులదే. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయులకు సంబంధించి ఎలాంటి వివాదం లేకుండా బదిలీల ప్రక్రియ పూర్తి చేశాం. జీవో 317 కింద తలెత్తిన సమస్యలను పరిష్కరించాం. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు కల్పించాం" అని గుర్తుచేశారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపు

"30–35 ఏళ్లు కష్టపడి ప్రజలకు సేవలు అందించి రిటైర్మెంట్ తర్వాత బెనిఫిట్స్ ఇవ్వకపోగా పదవీ విరమణ వయస్సును 58 నుంచి 61 చేయడం వల్ల 2025 నుంచి రిటైర్మెంట్లు మొదలయ్యాయి. గత ప్రభుత్వం దాదాపు 8 వేల కోట్ల రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా పెండింగ్‌లో పెడితే, వంద రోజుల్లో రూ. 6 వేల కోట్లు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం చెల్లించాం" అని ముఖ్యమంత్రి తెలిపారు.

## ఉపాధ్యాయుల అంకితభావం స్ఫూర్తిదాయకం

ఆసక్తిని పెంచేందుకు తాము అనుసరిస్తున్న వినూత్న బోధనా పద్ధతులు, విద్యతో పాటు చేపడుతున్న సామాజిక కార్యక్రమాల గురించి వివరించారు. విద్యార్థులను మరింత ఆసక్తిగా నేర్చుకునేలా చేసే ప్రయోగాత్మక విధానాలను పరస్పరం పంచుకోవాలని ప్రధాని సూచించారు.జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) ప్రభావం, మాతృభాషలో విద్యాభ్యాసం ప్రాధాన్యంపై కూడా మోదీ ఉపాధ్యాయులతో చర్చించారు. వివిధ ప్రాంతాల జానపద కథలు, స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా భాషలు, దేశ వైవిధ్యంపై అవగాహన పెంచవచ్చని సూచించారు.

విద్యార్థులను దేశంలోని వివిధ ప్రాంతాలకు విద్యా పర్యటనలకు తీసుకెళ్లాలని, తద్వారా పుస్తక జ్ఞానంతో పాటు భారతదేశ వైవిధ్యం, చరిత్ర, సంస్కృతిని ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించాలని ప్రధాని అన్నారు. అవార్డు పొందిన ఉపాధ్యాయులు ఒకరితో ఒకరు అనుసంధానమై తమ ఉత్తమ బోధనా పద్ధతులను పంచుకోవాలని సూచించారు. వికసిత్ భారత్ నిర్మాణంలో యువతను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం దేశ విద్యా రంగానికి గర్వకారణమని అన్నారు.

2026 జాతీయ ఉపాధ్యాయుల పురస్కారాలకు మొత్తం 69 మంది ఎంపికయ్యారు. వీరిలో 48 మంది పాఠశాల ఉపాధ్యాయులు, 21 మంది ఉన్నత విద్యా సంస్థలు, పాలిటెక్నిక్‌లకు చెందిన ఉపాధ్యాయులు ఉన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సెప్టెంబర్ 5న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో పురస్కారాలను ప్రదానం చేయనున్నారు.

## భూ భారతి.. రైతుల భూములకు భారమా?

అవకాశం లేకపోవడం బాధాకరమన్నారు.గతంలో ధరణి పేరుతో భూ సమస్యలు ఎదుర్కొన్న రైతులకు ఇప్పుడు భూ భారతి పేరుతో మరో సమస్యను ప్రభుత్వం తీసుకొచ్చిందని బీజేపీ నేతలు విమర్శించారు. భూముల వివరాల్లో తప్పులు, నిషేధిత జాబితాలో పేర్లు చేరడం వంటి సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. పట్టాదారుల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం.. వారికి మరిన్ని ఇబ్బందులు కలిగించే నిర్ణయాలు తీసుకోకూడదని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 'బంగారు తెలంగాణ' పేరుతో ప్రజలను మోసం చేశారని, ఆ తర్వాత కేసీఆర్ కుటుంబంపై ఉన్న వ్యతిరేకతతో ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం అప్పగించారని బీజేపీ నేతలు అన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా వెయ్యి రోజుల పాలన అంటూ సంబరాలు చేసుకోవడం సరికాదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులు, వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆరోపించారు.రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ముఖ్యంగా 22–ఏ నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూములను గుర్తించి వాటిని వెంటనే తొలగించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, ఎంతమంది రైతుల భూములు 22–ఏలో ఉన్నాయో వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

# వడ్తల గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



ముధోల్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండలంలోని వడ్తల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. గ్రామ సర్పంచ్ రమేష్ అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు కార్డులను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా మార్చడానికి, సరుకులు సక్రమంగా పొందేందుకు స్మార్ట్ కార్డులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలకు ఈ డిజిటల్ కార్డులే ప్రామాణికంగా నిలుస్తాయని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు దక్కేలా చూస్తామని స్పష్టం చేశారు. కార్డులు అందుకున్న పేదలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, రేషన్ డీలర్, గ్రామ వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# దేవుని తర్వాత గురువే ప్రత్యక్ష దైవం: విహెచ్‌పీ నేత ఇరగదిండ్ల సత్యం




సారంగాపూర్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు): సమాజంలో దేవుని తర్వాత అంతటి అత్యున్నత స్థానం గురువుకే దక్కుతుందని విశ్వహిందూ పరిషత్ సారంగాపూర్ ప్రఖండ అధ్యక్షుడు ఇరగదిండ్ల సత్యం అన్నారు. విశ్వహిందూ పరిషత్ స్థాపన దినోత్సవం మరియు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని పలు పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులను విహెచ్‌పీ, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే గురువుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సత్ప్రవర్తన, దేశభక్తిని పెంపొందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ దళ్ మండల అధ్యక్షుడు గాంధారి రవితేజ, సభ్యులు రజినీకాంత్ గౌడ్, దొడ నరేష్, దొడ దినేష్, శ్రీధర్, సతీష్, శ్రీవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాంకిషన్ రెడ్డి



సారంగాపూర్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు): సారంగాపూర్ మండలంలో ఇటీవల పలు కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాంకిషన్ రెడ్డి శనివారం పరామర్శించారు. మండలంలోని చించోలి (ఎం) గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ల జిల్లా అధ్యక్షుడు తాంద్ర సాయందర్ సోదరుడు అడెల్లు మృతి చెందగా వారి నివాసానికి వెళ్లి నివాళు లర్పించారు. అలాగే దుప్పయ తండాలో జాదవ్ మంగీలాల్, రాంసింగ్ తండాలో జాదవ్ కుంబాజీ ఇటీవల మృతి చెందగా ఆయా కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మహేష్ రెడ్డి, మండల అధ్యక్షుడు దేవి శంకర్, నాయకులు ముత్యంరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, గంగాధర్, సతీష్, భోజన్న, నరేష్, ధనుంజయ్, బుర్రి రాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రేపు జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా



సారంగాపూర్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నిరసన ధర్నాను విజయవంతం చేయాలని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న ముదిరాజ్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని తాంద్ర (జి), కంకెట, సారంగాపూర్, జామ్, సాయినగర్ తండా, ధని గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ప్రజలను సమీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించకుండా విద్యను దూరం చేస్తోందని మండిపడ్డారు. 90 శాతం ఉన్న బహుజనులు విద్యావంతులుగా ఎదిగినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. డాక్టర్ విశారదన్ మహారాజ్ నాయకత్వంలో పోరాటాలు సాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రామగిరి రవీందర్, జిల్లా కార్యదర్శి కల్లూరు సుధాకర్, సుదర్ సింగ్, శివరాజ్ మహారాజ్, గోవర్ధన్, నరసయ్య, రాము పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులే సమసమాజ నిర్మాతలు: కలెక్టర్ భవేశ్ మిశ్రా

## కలెక్టరేట్‌లో ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం.. అవార్డుల ప్రదానం

## ఏఐ యుగంలో ప్రాక్టికల్ నాలెడ్జ్ అత్యంత కీలకం: కలెక్టర్



నిర్మల్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు): విద్యార్థులకు జ్ఞానం, నైపుణ్యాలతో పాటు జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని అందించి, వారి భవిష్యత్తుకు సరైన దిశానిర్దేశం చేసేది ఉపాధ్యాయులేనని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కొనియాడారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కృత్రిమ మేధస్సు (ఏఐ) కాలంలో పాఠ్యపుస్తకాల బట్టీ చదువుల కంటే ఆచరణాత్మక పరిజ్ఞానం (ప్రాక్టికల్ నాలెడ్జ్) ఎంతో కీలకమన్నారు. ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ సంస్థల అభివృద్ధికి మూలకారణం నైపుణ్య మానవ వనరులేనని, దానికి బలమైన పునాది ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. విద్యార్థుల్లో పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చి, సన్మార్గంలో నడిపించాలని సూచించారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి కలెక్టర్ శాలువాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో డీఈవో భోజన్న, డీఆర్వో రమేష్ రాథోడ్, డీఐఈవో పరశురామ్, సంక్షేమ అధికారులు శ్రీనివాస్, దయానంద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ కుమార్తె ప్రతిభ: ఎంబీబీఎస్ సీటు సాధించిన రాథోడ్ సవిత



తానూరు/ముధోల్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఎదురైనా సంకల్ప బలం, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నిరూపించింది ఓ సాధారణ ఆటో డ్రైవర్ కుమార్తె. తానూరు మండల పరిధిలోని మారుమూల గ్రామం ఝరి (బి)కి చెందిన రాథోడ్ దేవిదాస్-సంగీత దంపతుల కుమార్తె రాథోడ్ సవిత జాతీయ వైద్య ప్రవేశ పరీక్ష (నీట్)లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సూర్యాపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సొంతం చేసుకుంది. కుటుంబ పోషణ కోసం తండ్రి దేవిదాస్ నిత్యం ఆటో నడుపుతూ కుమార్తె చదువుకు అండగా నిలవగా, తండ్రి పడే కష్టాన్ని చూసిన సవిత పట్టుదలతో శ్రమించి 720 మార్కులకు గాను 467 మార్కులు సాధించి మెడికల్ సీటు కైవసం చేసుకుంది. ఆమె సాధించిన విజయం పట్ల ఝరి (బి) గ్రామంలో గ్రామస్తులు, కుల పెద్దలు శాలువాతో సవితను ఘనంగా సత్కరించి మిఠాయిలు పంచి పెట్టారు. గ్రామీణ విద్యార్థులకు ఆమె విజయం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మేకల దేవదాస్, జల్లేవార్ రాములు, ఆసం మాధవ్, రాథోడ్ లాలు, శ్యామ్‌రావు, గణేష్, జాదవ్ గోరఖ్‌నాథ్, రాజు, గైక్వాడ్ సాయినాథ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాల జగిత్యాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన జట్టి శ్వేత




నిర్మల్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు): సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చి పట్టుదలతో శ్రమించిన విద్యార్థిని జట్టి శ్వేత నీట్ పరీక్షలో విశేష ప్రతిభ చూపి జగిత్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటును కైవసం చేసుకుంది. నిర్మల్ పట్టణంలోని ఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన శ్వేత, కళాశాల అధ్యాపకుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మెడికల్ సీటు సాధించి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. శ్వేత సాధించిన విజయాన్ని పురస్కరించుకుని శనివారం కళాశాల ప్రాంగణంలో యాజమాన్యం ఆమెను ఘనంగా సత్కరించింది. సంస్థ డీజీఎం జి. గోవర్ధన్ రెడ్డి, జోనల్ ఇన్చార్జ్ ఎల్మాసి నాగేష్ యాదవ్, అకాడమిక్ డీన్ రాంబాబు, ప్రిన్సిపాల్ నరేంద్ర రెడ్డి శ్వేతను శాలువా, పుష్పగుచ్ఛంతో అభినందించారు. గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థినులకు శ్వేత విజయం మార్గదర్శకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

# బీజేపీ పార్టీ డస్ట్ బిన్ కాదు

జనతా పార్టీలో చేరబోతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో మరియు కొన్ని రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున ప్రచారం మొదలైంది. ఈ ఊహాగానాలపై బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, సీనియర్ నేత పి. మురళీధర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత కలహాల ప్రతిఫలమైన ఈ వ్యవహారంలోకి కమలం పార్టీని లాగడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, సోషల్ మీడియా వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ తమ సొంత ఇల్లు చక్కదిద్దుకోలేక, అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతున్న ప్రతీసారి బీజేపీ పేరును తెరపైకి తీసుకురావడం పరిపాటిగా మారిందని మురళీధర్ రావు మండిపడ్డారు. “బీజేపీ ఏమీ డస్ట్ బిన్ కాదు” అంటూ అత్యంత కఠినమైన పదజాలంతో స్పందించిన ఆయన, ఇతర పార్టీల నుంచి క్రమశిక్షణా రాహిత్యం కారణంగా బర్తరఫ్ అయిన వారికో లేక అసంతృప్తితో బయటకు వచ్చిన నేతలకో ఆశ్రయం కల్పించే రాజకీయ డంపింగ్ గ్రౌండ్ లాగా తమ పార్టీ వ్యవహరించదని

# వరుస ఆలయ చోరీల ముఠా గుట్టురట్టు: నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

### 25 దొంగతనాల కేసుల్లో నలుగురు నిందితుల అరెస్ట్.. 12 కిలోల వెండి, కారు స్వాధీనం రంగంలోకి దిగి నిందితులను పట్టుకున్న 'టైగర్స్ టాస్క్ ఫోర్స్' బృందం




నిర్మల్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లాతో పాటు పొరుగు రాష్ట్రంలోని దేవాలయాలు, ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టును నిర్మల్ పోలీసులు రట్టు చేశారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్ కేసు వివరాలను వెల్లడించారు. జిల్లాలో వరుసగా జరుగుతున్న ఆలయాల చోరీలను అరికట్టేందుకు 'టైగర్స్ టాస్క్ ఫోర్స్'ను ఏర్పాటు చేసి, భైంసా ఏఎస్పీ, నిర్మల్ డీఎస్పీల పర్యవేక్షణలో సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరా ఫుటేజీల ద్వారా దర్యాప్తు వేగవంతం చేశామన్నారు.
ఈ విచారణలో మొత్తం 25 చోరీల్లో ప్రమేయం ఉన్న నలుగురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిర్మల్ బాగుల్వాడకు చెందిన మారేపెద్ది రాజశేఖర్ (ఐరన్ షాప్), గద్చంద రాజేశ్వర్ (అమెజాన్ డెలివరీ బాయ్), చిట్యాల గ్రామానికి చెందిన కల్లద్దవార్ శ్రీకాంత్ (కార్పెంటర్), హైదరాబాద్‌కు చెందిన సారా సాయికిరణ్‌లను అదుపులోకి తీసుకున్నారు. అయ్యప్ప, శాస్త్రినగర్ ఆంజనేయస్వామి, మహాలక్ష్మి, మామడ వెంకటేశ్వర స్వామి దేవాలయాలతో పాటు లోకేశ్వరం, కిష్టాపూర్, వంజర, ఏపీలోని ఏలూరు, గన్నవరం తదితర ప్రాంతాల్లో జరిగిన 16 కేసులకు సంబంధించి చోరీ సొత్తును రికవరీ చేశారు.
నిందితుల నుంచి 12 కిలోల వెండి ఆభరణాలు, కిరీటాలు, నిస్సాన్ మాగ్నైట్ కారు, మెల్టింగ్ మెషిన్, గ్యాస్ పైప్ మెషిన్, రూ. 67,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో విశేష ప్రతిభ కనబరిచిన భైంసా ఏఎస్పీ సాయికిరణ్, డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు కృష్ణ, సమ్మయ్య, ఎస్సైలు లింబాద్రి, గణేష్, శ్రీకాంత్, అశోక్, గఫార్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## నేడు మంత్రి జూపల్లి బాసర పర్యటన: ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్




బాసర, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం బాసర పుణ్యక్షేత్రంలో పర్యటించి పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో పాల్గొననున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శనివారం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం, గోదావరి పరిసర ప్రాంతాలను కలెక్టర్ స్వయంగా సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అనంతరం భైంసా తహసీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను తనిఖీ చేసి, ఓటర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఈ పర్యటనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇరిగేషన్ ఈఈ అనిల్, ఆర్ అండ్ బీ ఈఈ సుభాష్, బాసర ఆలయ ఈవో అంజనీదేవి, తహసీల్దార్లు పవన్ చంద్ర, శశిభూషణ్ పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలన ఉద్యమానికి అంతర్జాతీయ గుర్తింపు




నిర్మల్ రూరల్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా కేంద్రంలో చేపట్టిన బాల్య వివాహాల నిర్మూలన ఉద్యమానికి ఐక్యరాజ్యసమితి గుర్తింపు లభించడం చారిత్రాత్మక విజయమని విజన్ స్వచ్ఛంద సంస్థ జిల్లా సమన్వయకర్త ఎస్. శరత్ కుమార్ పేర్కొన్నారు. నవంబర్ 27వ తేదీని చిన్న వయస్సు మరియు బలవంతపు వివాహాల నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించడాన్ని విజన్ సంస్థ స్వాగతించింది. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జేఆర్సీ) వ్యవస్థాపకులు భువన్ రిభు చేసిన నిరంతర పోరాటం వల్లే ఈ గుర్తింపు సాధ్యమైందన్నారు. జిల్లాలోని గ్రామాలు, పాఠశాలలు, కమ్యూనిటీలలో బాల్య వివాహాల వ్యతిరేక ప్రతిజ్ఞలు, గ్రామ కమిటీల ద్వారా విస్తృత చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి బాలుడు, బాలికకు విద్య, స్వేచ్ఛాయుత భవిష్యత్తు అందించే వరకు తమ పోరాటం సాగుతుందన్నారు. బాల్య వివాహ రహిత నిర్మల్ నిర్మాణానికి ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు భూషణ్, పద్మ, విజన్ సంస్థ సభ్యులు రజిత, హారిక, జరీనాబేగం, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.




## బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వయం పరిపాలన




దిలావర్‌పూర్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం మరియు స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ వేడుకలకు రిటైర్డ్ డీవీఈవోలు సిహెచ్. ప్రభాకర్, బి. నాగేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులే స్వయంగా అధ్యాపకులుగా మారి విద్యాబోధన చేయడం, పరిపాలన బాధ్యతలు నిర్వర్తించడం వారి నాయకత్వ లక్షణాలను వెలికితీస్తుందని కొనియాడారు. విద్యార్థులు పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా లక్ష్యాలను నిర్దేశించుకుని శ్రమించాలని సూచించారు. అనంతరం కళాశాల అధ్యాపకులను, సిబ్బందిని విద్యార్థులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి. సుదర్శన్, ఎన్ఎస్ఎస్ అధికారి మాలేపు కృష్ణ, సీనియర్ అధ్యాపకులు రామారావు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన పోలీస్ అధికారుల సంఘం




నిర్మల్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా పోలీస్ అధికారుల సంఘానికి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు శనివారం జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్‌ను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు దండేకర్ సాయి ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నూతన కార్యవర్గం పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. సిబ్బందికి ఆపద సమయాల్లో తక్షణ వైద్య సదుపాయాలు అందేలా చూడాలన్నారు. విధుల్లో క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించడంలో అసోసియేషన్ ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయికిరణ్ ఐపీఎస్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, ఆర్ఐ అమిత్ రామ్ మరియు నూతన కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మాడేగాం పంచాయతీ, అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీవో




దిలావర్‌పూర్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
దిలావర్‌పూర్ మండల పరిధిలోని మాడేగాం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ కార్యాలయంలోని రికార్డులు, పన్ను వసూళ్ల రిజిస్టర్లు, పారిశుద్ధ్య కార్మికుల హాజరును క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామాల్లో వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహార పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, చిన్నారుల హాజరు శాతం పెంచాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. ఈ తనిఖీల్లో పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లంబర్ల గౌరవం, హక్కుల సాధనకు ఐక్య పోరాటం: షేక్ ముదాసీర్



నిర్మల్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
భవన నిర్మాణ రంగంలో కీలకమైన సేవలందిస్తున్న ప్లంబర్ల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణకు ఐక్యంగా పనిచేస్తామని న్యూ నిర్మల్ యంగ్ స్టార్స్ ప్లంబర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు షేక్ ముదాసీర్ స్పష్టం చేశారు. నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా షేక్ అఫ్రోజ్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ రఫీక్, కోశాధికారిగా షేక్ మాజీద్, ఉపకోశాధికారిగా షేక్ ముజాహిద్, రైటర్‌గా షేక్ ఫైజల్ ఎన్నికయ్యారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన లేబర్ అధికారి ముత్యంరెడ్డి మాట్లాడుతూ కార్మికులు పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం ముదాసీర్ మాట్లాడుతూ ప్లంబర్ కేవలం కూలీ కాదని, సాంకేతిక నిపుణుడని పేర్కొన్నారు. ప్రభుత్వం, కాంట్రాక్టర్లు పనులకు సరైన వేతనాలు అందించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.


OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER

# సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన పేదలందరికీ అందాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):




రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాల ఫలాలు క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులందరికీ పక్కాగా అందాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతిపై ఆయన విస్తృత సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పథకాల అమలు తీరు, ప్రజలకు చేకూరిన లబ్ధి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలులో క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు, సాంకేతిక అడ్డంకులు ఎదురైనా తక్షణమే పరిష్కరించి అర్హులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. పేదరికాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు సద్వినియోగం కావాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్, సీపీవో గంగారెడ్డి, డీఎంహెచ్‌వో రాజేందర్, వ్యవసాయ అధికారి సుజాత, హార్టికల్చర్ అధికారి రమణ, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ రెడ్డి, సంక్షేమ అధికారి వినూత్న పాల్గొన్నారు.

# రైతులు సమగ్ర వ్యవసాయం వైపు అడుగులు వేయాలి: డీఆర్‌డీవో విజయలక్ష్మి

ముధోల్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):




నీటి సంరక్షణ పద్ధతులను పాటిస్తూనే అదనపు ఆదాయం పొందేలా రైతులు సమగ్ర వ్యవసాయ విధానాలను అలవర్చుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీవో) విజయలక్ష్మి సూచించారు. ముధోల్ మండల పరిధిలో వి.బి.-జీ రామ్-జీ, సెర్ప్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఫారం పాండ్లు, ఇంకుడు గుంతల క్షేత్రాలను ఆమె పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. వర్షపు నీటిని ఫారం పాండ్ల ద్వారా ఒడిసిపట్టి భూగర్భ జలాలను రీఛార్జ్ చేయడంతో పాటు, అందులోనే చేపల పెంపకం, గట్లపై కూరగాయల సాగు, పశుపోషణ వంటి అనుబంధ రంగాలను చేపడితే అధిక లాభాలు వస్తాయన్నారు. ఒకే పొలంలో బహుళ ఆదాయ మార్గాలను సృష్టించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలోని మామిడి తోటలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లవకుమార్, ఏపీఎం గురుచరణ్, ఏపీవో శిరీష, ముధోల్ సర్పంచ్ షబానా ఎజాజుద్దీన్, సెర్ప్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధిత రైతులకు పంట నష్టపరిహారం: నారాయణరావు పటేల్

ముధోల్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):



ముధోల్ నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్నిప్రమాదాల్లో సర్వం కోల్పోయిన మొక్కజొన్న రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించనుందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్చార్జి భోంస్లే నారాయణరావు పటేల్ తెలిపారు. రైతుల తీవ్ర నష్టాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి పరిహారం మంజూరుకు చర్యలు తీసుకున్నారన్నారు. ఆరుగాలం శ్రమించిన పంట బూడిదైన వేళ అన్నదాతలు అధైర్యపడకుండా ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అన్నదాతలను ఆదుకుంటున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు నియోజకవర్గ రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం పట్ల మండల రైతాంగం హర్షం వ్యక్తం చేసింది.

# బాసర గోదావరిలో మహిళ ఆత్మహత్యాయత్నం భగ్నం: కాపాడిన పోలీసులు

.బాసర, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):



బాసర గోదావరి నదీ తీరంలో శనివారం ఓ మహిళ చేపట్టిన ఆత్మహత్యాయత్నాన్ని పోలీసులు, స్థానికులు సమయస్ఫూర్తితో వ్యవహరించి అడ్డుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ అల్వాల్ పరిసరాల్లో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటున్న షానే సవిత (30) కుటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకునేందుకు గోదావరి నది వైపు వెళుతుండగా, ఘాట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది గుర్తించారు. వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని బాసర పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కుటుంబ సమస్యలపై పోలీసులు మహిళకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించి మనోధైర్యం కల్పించారు. అనంతరం భైంసా మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఆమె బంధువైన దడేళ్ల రాజేష్‌ను స్టేషన్‌కు పిలిపించి క్షేమంగా అప్పగించారు. సమయానికి స్పందించి ప్రాణాలు కాపాడిన పోలీసులను స్థానికులు అభినందించారు.

# అక్షర పాఠశాల డైరెక్టర్ జారికోటి సుభాష్‌కు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ముధోల్/నిర్మల్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):



ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారిక వేడుకల్లో ముధోల్ పట్టణానికి చెందిన శ్రీ అక్షర పాఠశాల డైరెక్టర్ జారికోటి సుభాష్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. విద్యా రంగంలో విశేష సేవలందిస్తూ గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నందుకు గాను ఆయనకు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ తనకు ఈ గౌరవం దక్కడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ గుర్తింపు భవిష్యత్తులో మరింత బాధ్యతాయుతంగా పనిచేసేందుకు దోహదపడుతుందని కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సుభాష్ అవార్డు పొందడం పట్ల ముధోల్ పట్టణ ప్రముఖులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

నిర్మల్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):




నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1, 2ల ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు సూర్యాసాగర్, ఐ. నాయన్ రజితల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులే అధ్యాపకులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి స్వయం పరిపాలనను చాటారు. అనంతరం కళాశాల అధ్యాపకులందరినీ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న గణిత అధ్యాపకుడు కె. రమేష్‌రెడ్డిని ప్రిన్సిపాల్ ఎం. సుధాకర్, అధ్యాపకులు అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రను స్మరించుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాసర దత్తాత్రేయ మందిరంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

బాసర, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):



బాసర క్షేత్ర సమీపంలోని దత్తాత్రేయ మందిరంలో శ్రీ సాయందేవ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వేసిన చిత్రాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విజేతలకు ఆలయ కమిటీ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. అనంతరం ఉపాధ్యా యులను శాలువాలతో సన్మానించి ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయ ట్రస్ట్ సభ్యులు మనోజ్ తలానికర్, ఆనంద్‌రావు పటేల్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# దీక్ష ,ఎస్ఆర్ కళాశాలల్లో గురుపూజోత్సవ సంబరాలు

నిర్మల్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):






నిర్మల్ జిల్లా కేంద్రంలోని దీక్ష జూనియర్ కళాశాల మరియు ఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. దీక్ష కళాశాలలో ప్రిన్సిపాల్ సిహెచ్. వెంకట్‌రెడ్డి, కరస్పాండెంట్ ప్రమోద్‌రావులు ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఎస్ఆర్ బాలికల కళాశాలలో డీజీఎం గోవర్ధన్ రెడ్డి, జోనల్ ఇన్చార్జ్ నాగేష్ యాదవ్, డీన్ రాంబాబుల ఆధ్వర్యంలో అధ్యాపకులను మెమెంటోలతో సత్కరించారు. విద్యార్థుల ఉన్నతికి గురువుల మార్గదర్శకత్వమే కీలకమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళా శాలల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.